




ఈబీసీ నేస్తం మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

16,462 మందికి ఈబీసీ నేస్తం

రూ.24.70 కోట్ల నగదు జమ

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లాలో ఈబీసీ నేస్తం పథకం కింద 16,462 మంది లబ్ధిదారులకు 24.70 కోట్లు లబ్ధి చేకూరిందని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. వైఎస్‌ఆర్ ఈబీసీ నేస్తం పథకం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని పుట్టపర్తి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఈబీసీ ద్వారా ఒక్కొక్కరికి 15 వేలు ప్రకారం రెండవ విడత కింద నిధులు మంజూరు చేశారన్నారు. జిల్లాలో మొదట విడతలో రూ.24.04 కోట్లు మంజూరు కాగా రెండో విడతలో రూ.24.70 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అనంతరం కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, బీసీ కార్పొరేషన్ ఎఇఒ ఆర్.విజయలక్ష్మి, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు : కలెక్టర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలని సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ధర్మవరం పట్టణ సమీపంలోని పోతులనాగేపల్లి లేఅవుట్‌ను బుధవారం సాయంత్రం పరిశీలించారు. జగనన్న లేఅవుట్లో ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశలో ఉన్నాయో హౌసింగ్ డీఈ మునీశ్వర్‌నాయుడు, ఏఈ బాలాజీలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. ఆర్‌ఎల్ స్థాయిలో ఆగిపోయిన ఇళ్లు సకాలంలో నిర్మాణం జరిగేలా నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. లేఅవుట్‌లలో అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలికంగా నీటి సరఫరా ఇవ్వాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇక్కడ శాశ్వతంగా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకునేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి ఫోన్ ద్వారా ఆదేశించారు. ఇప్పటికే ఇక్కడ ఇళ్లు పూర్తి కాగా కొన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఇక్కడ వీధిలైట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతకుమునుపు ధర్మవరంలోని మార్కెట్లోని పౌరసరఫరాల సంస్థ గోదామును తనిఖీచేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో తిప్పేనాయక్, తహశీల్దార్ యోగేశ్వరిదేవి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ భవానీశంకర్, హౌసింగ్ ఈఈ చంద్రశేఖర్, డీఈ మునీశ్వర్‌నాయుడు, ఏఈ బాలాజీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మార్కెటింగ్ ఏఈ మూర్తి, సెక్రటరీ రంగనాథ్‌లు ఉన్నారు.



ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సూరీడు సుర్రుమంటున్నాడు. గత పది రోజులుగా భానుడి భగభగలు పెరిగాయి. ఉదయం 10 గంటల నుంచే సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఓ వైపు ఎండ వేడిమి, మరో వైపు ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు మధ్యాహ్న సమయంలో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టాలంటనే భయపడుతున్నారు. గత ఆరు రోజులగా ప్రతి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఈ నెలాఖరకు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.



సుర్రుమంటున్న సూరీడు..!

ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా నమోదు అయిన ఉష్ణోగ్రతలు

తేది	గరిష్ఠం	కనిష్ఠం
06	41.2	22.8
07	40.7	23.2
08	40.8	23.6
09	40.9	21.4
10	41.2	22.6
11	41.6	23.4
12	41.7	23.2

శ్రీ సత్యసాయి జిల్లా

తేది	గరిష్ఠం	కనిష్ఠం
06	40.4	22.1
07	40.2	22.8
08	39.7	23.1
09	40.6	21.1
10	40.5	27.3
11	41.3	22.6
12	41.5	22.8

◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా పెరిగిన ఉష్ణోగ్రతలు
◆ 41 డిగ్రీలకు పైగా నమోదు ◆ ఉదయం 10గం॥ నుంచే ఎండలు
◆ ఉక్కిరిబిక్కిరవుతున్న జనం ◆ బయటకు రావాలంటనే భయం



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఏప్రిల్‌లోనే ఎండలు మండుతున్నాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు రెండింటిలోనూ ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. జనం బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. మధ్యాహ్న సమయాల్లో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. దీనికితోడు పల్లెల్లోనూ, పట్టణాల్లోనూ విద్యుత్ కోతలూ ఉంటుండటంతో జనం ఉక్కపోతాలతోనూ అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే మేలో పరిస్థితి ఏమిటని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజులగా 41 డిగ్రీలకు పైగానే..

ఉమ్మడి జిల్లాలో గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే 41 డిగ్రీలకు పైగానే నమోదు అయ్యాయి. అనంతపురం జిల్లాలో పరిశీలిస్తే ఈ నెల 6వ దీన 41.6, 7న 40.7, 8న 40.8, 9న 40.9, 10న 41.2, 11న 41.6, 12న 41.7 డిగ్రీలు నమోదు అయ్యింది. ఇక సత్యసాయి జిల్లా విషయానికి వస్తే ఈ నెల 6న 40.4, 7న 40.2, 8న 39.7, 9న 40.6, 10న 40.5, 11న 41.3, 12న 41.5 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రానున్న రోజులు ఇది మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

గతేడాదీ అత్యధికం..

గతేడాదిలో ఉమ్మడి జిల్లా వాసులను ఎండలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఏప్రిల్ 3వ వారంలో ఏకంగా 43.1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఈ స్థాయిలో ఉష్ణోగ్రత 2016, 2017 తరువాత ఆ ఏడాదే నమోదయ్యింది. 2016వ సంవత్సరంలో ఏప్రిల్ నెలలో గరిష్టంగా నమోదయిన ఉష్ణోగ్రత జిల్లాలో 44.5 డిగ్రీలు. ఆ తరువాత 2017లో ఇదే మాసంలో 43.7 డిగ్రీలు గరిష్టంగా నమోదయింది. ఆ తరువత 2018లో గరిష్టంగా 42.3 డిగ్రీల, 2019లో 42.9 డిగ్రీలు, 2020లో 41.9 డిగ్రీలు, 2021లో 41.6 డిగ్రీలు నమోదయింది. గతేడాది 2022లో ఏప్రిల్ 21వ తేదీన గరిష్టంగా 43.1 డిగ్రీలు ఉష్ణోగ్రత జిల్లాలో నమోదయింది. ఈ ఏడాదికూడా ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఉక్కపోతలతో అల్లాడుతున్న జనం

ఎండలకు తోడు ఉక్కపోత అధికంగా ఉండటంతో జనం అల్లాడుతున్నారు. దీనికితోడు విద్యుత్ కోతలు కూడా జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కరెంటు లేకుండాపోతుండటంతో జనం ఇంట్లో ఉండలేక, బయటకు రాలేక అవస్థ పడుతున్నారు. కరెంటు ఉంటే కూలర్లు, ఎసిలు ఆన్ చేసుకుని కాస్త సేదదీరేందుకు ప్రయత్నిస్తున్నారు.

శీతలపానీయాలకు పెరిగిన గిరాకీ

ఎండ వేడిమి పెరగడంతో శీతలపానియాలు, జ్యూస్ కేంద్రాలకు విపరీతమైన గిరాకీ పెరిగింది. అదే సమయంలో మినరల్ వాటర్ ప్లాంట్లలోనూ ప్రత్యేకంగా కూలింగ్ వాటర్ క్యాన్లను అమ్ముతున్నారు. వీటి ధర గతంలో రూ.20 ఉండగా, ఇప్పుడు రూ.40 వరకు ఉంటోంది. వీటిని మంచి గిరాకీ పెరిగింది. ఫ్రీజ్‌లు, ఎసిల వ్యాపారాలు జోరందుకున్నాయి. ఎండ వేడిమి నుంచి తప్పించుకునేందుకు వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే భూ వివాదం

◆ భూహక్కుదారుల వారసులకు న్యాయం చేయాలి ◆ కెవిపిఎస్, వ్యకాసం డిమాండ్

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలో అధికారుల నిర్లక్ష్యం భూ వివాదానికి కారణం అవుతోందని కెవిపిఎస్, వ్యకాసం నాయకులు తెలిపారు. బుధవారం నాడు పట్టణంలోని మడకశిర రోడ్డులో చోటు చేసుకున్న భూ వివాదంపై ఆ సంఘం నాయకులు స్పందించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణ, హనుమయ్య, వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ కుటుంబానికి చెందిన సయ్యద్ ఎద్దుల్లా, హుస్సేన్ మహమ్మద్ కుటుంబాలకు చెందిన భూమిని పట్టణానికి చెందిన రామాంజనేయులు, వెంకటేశులు, పార్వతమ్మలు అక్రమ కొనుగోలుతో దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని చెప్పారు. స్థలంలో ఏర్పాటు చేసుకున్న ఇనుపపెట్టను తొలగించాలని ఎద్దుల హుస్సేన్, మహమ్మద్ వారసులు పలుమార్లు సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. దీంతో గత్యంతరం లేక వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆక్రమణదారుల ఇనుపపెట్టెను ఆ భూమి నుంచి తొలగించారన్నారు. దీంతో వివాదం చోటుచేసు కుందన్నారు. ఈ సమయంలో ఆక్రమణదారులు భూమి హక్కుదారులపై దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనలో భూ వివాదానికి అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోందన్నారు. ఈ వివాదం తీవ్రరూపం దాల్చకుండా అధికారులు జోక్యం చేసుకుని నిజమైన హక్కుదారులు ఎద్దుల హుస్సేన్, మహమ్మద్ వారసులకు భూమి అప్పగించి, వారి కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతమ్మ, వెంకటేశులు, నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, వెంకటరాముడు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, భూహక్కుదారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ పేరుతో నకిలీ ఫిర్యాదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి ఐసిడిఎస్ పడమర ప్రాజెక్టు పరిధిలో నెలకొన్న సమస్యలపై అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ (సిఐటియు అనుబంధ) యూనియన్ పేరున కదిరి పడమర ప్రాజెక్టు సిడిపిఒ వరలక్ష్మి పై నకిలీ ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ నిమిత్తం బుధవారం ఆమె కదిరి పడమర ప్రాజెక్టుకు వచ్చారు. దీంఒ రీజినల్ డైరెక్టర్ పడమర ప్రాజెక్ట్ లో పనిచేస్తున్న యూనియన్ నాయకులను, వర్కర్లను పిలిచి విచారణ జరిపారు. అయితే ఈ విచారణలో వారు తాము సిడిపిఒపై తాము ఫిర్యాదు చేయలేదని తమకు సంబంధం లేదని యూనియన్ పేరును చెడగొట్టేందుకు తమ యూనియన్ పేరుతో నకిలీ ఫిర్యాదు చేశారని ఆమెకు తేల్చి యూనియన్ నాయకులు చెప్పారు. అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ సిఐటియు అనుబంధ యూనియన్ నాయకురాలు మాబున్నిస మాట్లాడుతూ తాము ఎవరిపైనా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని కావాలని యూనియన్ పేరు చెడగొట్టాలని దురుద్దేశంతో ఉన్నతాధికారులకు తమ యూనియన్ పేరుతో తప్పుడు ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ మేరకు ఆర్‌జెడి విలేకరులతో మాట్లాడుతూ కదిరి పడమర ప్రాజెక్టు సిడిపిఒ తమను ఇబ్బందులకు గురిచేస్తోందని తమ నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతోందని ఆమె తనిఖీ నిమిత్తం సెంటర్‌కు వెళ్ళిన చోట పట్టు చీరలు ఇవ్వాల్సిందేనని బిల్లుల కొరకు పర్సంటేజీ అడుగుతున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు ఆధారంగా విచారణ నిమిత్తం వచ్చామన్నారు

సమస్యలపై మరోమారు ఆర్జెడి వద్ద ప్రస్తావన : స్థానిక సమస్యలపై సిఐటియు నాయకులు జివిఎల్ నరసింహులు ఆర్జెడితో మరోమారు ప్రస్తావించారు. గతంలో ప్రాజెక్టు పరిధిలో నెలకొన్న సమస్యలపై డైరెక్టర్‌కి అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశామని అప్పట్లో వచ్చి కేవలం నామమాత్రంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇప్పటికి సమస్యలు పరిష్కారం రాలేదని విమర్శించారు. స్పందించిన ఆర్‌జెడి అప్పటి ఆరోపణలపై విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు పంపామని సిఐటియు నాయకులకు వివరించారు. అదేవిధంగా పెండింగ్ బిల్లులకు సంబంధించి అప్పటికప్పుడే అనంతపురం పిడి కార్యాలయ సిబ్బందికి ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే సత్యసాయి జిల్లా బిల్లులు పరిష్కారం చేయాలని ఆదేశించారు.

చిన్నకోడిపల్లిలో దాహం కేకలు

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని చిన్నకోడిపల్లి ప్రజలు దాహం కేకలు వేస్తున్నారు. కొన్ని రోజులుగా గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. బుధవారం రొద్దం నుంచి ప్రయివేటు నీటి ట్యాంకు రావడంతో గ్రామసులు నీటికోసం ఎగబడ్డారు. గత ప్రభుత్వంలో మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నీటిశుద్ధజాల కేంద్రాలు ఎక్కువ గ్రామాలలో మూతపడి పోయాయి. చిన్నకోడిపల్లి గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి గ్రామంలోని శుద్ధజల కేంద్రానికి మరమ్మతులు చేసి ప్రజలకు నీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు..!

◆ ఎమ్మెల్సీ ఎన్నికల దెబ్బకు వైసిపి ఎమ్మెల్యేల చేతికి బ్యాగులు
◆ భవిష్యత్తులో అన్ని వర్గాలకూ అండగా నిలుస్తాం
◆ యువగళంలో నారా లోకేష్
◆ రాయలచెరువు బహిరంగ సభకు భారీగా తరలొచ్చిన టిడిపి శ్రేణులు



యువగళం పాదయాత్రలో పాల్గొన్న నారా లోకేష్

ప్రజాశక్తి-పెద్దపప్పూరు, యాడికి

యువగళం పాదయాత్ర, ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దెబ్బకు ముఖ్యమంత్రి తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు వచ్చాయని, భవిష్యత్తులో ఇదే కొనసాగుతుందని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్ర బుధవారం 68వ రోజు అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలంలో కొనసాగింది. పసలూరు నుంచి ప్రారంభం అయిన యాత్ర కొట్టాలపల్లి, కమ్మవారిపల్లి, నగరూరు, తుట్రాలపల్లి, టి.కొత్తపల్లి, రామరాజుపల్లి, రాయలచెరువు గ్రామాల మీదుగా కొనసాగింది. రాయలచెరువులో రాత్రికి బస చేశారు. కమ్మవారిపల్లి వద్ద నిరుద్యోగ యువతతో భేటి అయ్యారు. నగరూరు వద్ద రైతులతో సమావేశం అయ్యారు. తుట్రాలపల్లి ఎస్సీ కాలనీలో సీనియర్ సిటిజన్లు, పట్టు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రామరాజుపల్లిలో ఎన్టీఆర్ గహాల బాధిత లబ్ధిదారులతో మాట్లాడారు. సాయంత్రం రాయలచెరువులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో టిడిపి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి లోకేష్ ప్రసంగించారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పరిపాలన కొనసాగుతోందన్నారు. ప్రజలపై భారాలు, వేధింపులు అధికం అయ్యాయన్నారు. రూ.10 ఖాతాలో వేసి రూ.100 దొడ్డిదారిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లాగేసుకుంటున్నాడని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ పూర్తి చేయని పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. అందుకే ప్రజలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల దెబ్బకు తాడేపల్లి కంపించిందన్నారు. ఈ పరిస్థితుల్లో వారి ఉనికిని చాటుకునేందుకే జగనే మా నమ్మకం అంటూ ఎమ్మెల్యేలకు స్టిక్కర్లు, బ్యాగులు ఇచ్చి రోడ్లపైకి పంపారన్నారు. జగన్మోహన్‌రెడ్డిది రాజారెడ్డి రాజ్యాంగం అయితే, టిడిపిది అంబేద్కర్ రాజ్యాంగం అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు రద్దు అవుతాయనే ప్రచారాన్ని వైసిపి నేతలు వాలంటీర్ల ద్వారా చేయిస్తున్నారని, దీనిని ఎవరూ నమ్మొద్దన్నారు. సంక్షేమానికి పట్టినిల్లు టిడిపి అని, ప్రజలకు మరిన్ని పథకాలను అందించి వారికి అండగా నిలుస్తుందని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక తాడిపత్రి ప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందోని లోకేష్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఈ దోపిడీ జరుగుతోందని చెప్పారు. 40 ఏళ్లు ఉండాడిల్సిన ఇసుకను ఈ నాలుగేళ్లలో దోచేశారన్నారు. ఈ దోపిడీ పాలనకు ప్రజలు అంతం పలకాలన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు రక్షణగా నిలుస్తామన్నారు. బిసి కార్పొరేషన్లను పటిష్ట పరిచి, దామాషా పద్ధతిలో నిధులు కేటాయిస్తామన్నారు. స్థానిక సంస్థల్లోనూ ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. బిసిలతో పాటు, ముస్లిం, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీలను ఆదుకునే చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగుల కోసం ప్రతి ఏడాదీ జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. పన్నుల భారాలను తగ్గించే చర్యలను తీసుకుంటామ్నరు. తాడిపత్రి ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలకు ప్రోత్సాహాలను అందిస్తామన్నారు. వాటిపై పన్నుల భారాలను తగ్గించి మూతబడిన గ్రానైట్ పరిశ్రమలను తెరిపిస్తామన్నారు. తాడిపత్రి ప్రాంతంలో చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేసి కార్మికులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు అండదండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

సొంత మనుషులకే రక్షణ లేదు
జెసి.అస్మిత్‌రెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆయన సొంత మనుషులకే రక్షణ లేదని, ఇక ప్రజల గురించి ఏమి ఆలోచిస్తారని తాడిపత్రి టిడిపి నియోజకవర్గం జెసి.అస్మిత్‌రెడ్డి తెలిపారు. యువగళం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇదే పాలన కొనసాగితే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకుని పోయిన గౌరవాన్ని రాష్ట్రానికి తీసుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారధి, తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి.అస్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సహకార సంఘాల నిర్వీర్యానికి కుట్ర : సిఐటియు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్




కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సహకార సంఘాలను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం పూనుకొందని, పిఎసిఎస్ ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ ఈనెల 17న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ తెలిపారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సహకార సంఘాల ఉద్యోగులతో కలిసి ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు పిఎసిఎస్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ పరపతి సహకార సంఘాలలో 50 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ వైసిపి ప్రభుత్వం సహకార సంఘాల చట్టానికి సవరణ చేసిందన్నారు. అలాగే ఈ సంఘాలను రైతు భరోసా కేంద్రాలలో విలీనం చేస్తూ మరో సవరణ బిల్లు అసెంబ్లీ ఆమోదించిందన్నారు. దీనివల్ల సహకార సంఘాల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీంతో రైతులు కూడా ఇబ్బందులు పడతారన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటుపరం చేస్తున్నాయన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ సహకార సంఘాల ఉద్యోగులు చేపట్టే ధర్నాల్లో రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే వైసిపి ధ్యేయం

బత్తలపల్లి : మహిళాభ్యున్నతే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా మూడో విడత మెగా చెక్కు పంపిణీ వారోత్సవాల సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న మహిళా సభ్యులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని మహిళలకు సూచించారు. మహిళలతో కలిసి జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆసరా మూడో విడత మెగా చెక్కును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కురుబకార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్య ప్రకాష్ బాబు, ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, డిపిఎం చేయూత రమణప్ప, ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీదేవి, ఎపిఎం సుదర్శన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com



చెరువులోకి వెళ్లే మురుగునీటిని చూపుతున్న భాస్కర్‌నాయుడు

చెరువులోకి మురుగునీరు

పుట్టపర్తి రూరల్ : బుక్కపట్నం చెరువులోకి మురుగునీరు చేరుతోంది. దీంతో చెరువులోని నీరు కలుషితమై చేపలు, ఇతర జీవరాసులు నశించిపోవడమే కాక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు డాక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. పుట్టపర్తి పట్టణం నుండి పలువోట్ల, కొత్తచెరువు కమ్మపాలెం, కొండ కింద ప్రయివేట్ నీరు చెరువులో కలుస్తోందని దాని ద్వారా నీరు మొత్తం కలుషితమవుతోందని వాపోయారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద నుండి బుక్కపట్నం చెరువులో కలుస్తున్న మురుగునీటికి ఈ మధ్యనే అడ్డుకట్ట వేయాలని కోరారు. గ్రామపంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోకపోతే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

దాతల సహకారం అభినందనీయం

కొత్తచెరువు : ఆర్టీటీ చేపట్టిన స్పందించు సహాయం అందించు కార్యక్రమానికి దాతలు అందించిన ఆర్థిక సాయం మరువలేనిదని వక్తలు అన్నారు. సామాజిక స్ఫూర్తితో ప్రారంభమైన సేవా హుండీ కార్యక్రమం ద్వారా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన స్పందించు సాయం అందించు కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి జయరాం, పాఠకులు సురేష్ బాబు, హరినాథ్ చౌదరి మహమ్మద్, కిష్టప్ప దాతృత్వం అందించడంతో వసూలు అయిన పదివేల రూపాయల మొత్తాన్ని ఆర్డీటీ సిఐ గంగాధర్‌కు గ్రంథాలయ అధికారి జయరాం అందజేశారు.

ఉపాధి పనుల పరిశీలన

గాండ్లపెంట : మండల పరిధిలోని మల్లమీదపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ రామాంజనేయులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో పూడిక తీత పనుల్లో కూలీల శాతం పెంచే విధంగా చూడాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.అంజినప్ప, ఏపీవో మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ అక్బర్, ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో వికలాంగులకు ఆర్టీసీ రాయితీ పాసులు

కదిరి టౌన్ : రూరల్ మండలం మొటుకుపల్లిలో ఆర్టీసీ వారు నిర్వహించిన వికలాంగుల బస్సుపాసు మేళాకు వచ్చిన 250 మంది బస్సు పాసు రిన్యూవల్ ఖర్చు రూ.25వేలను నల్లచెరువు వాసి పాళ్యం సుధాకర్ ఇచ్చారు. ఈ మేరకు వికలాంగులకు రాయితీ పాసులను కదిరి డిపో మేనేజరు బి.మైనోద్దీన్ అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి సెక్టర్ టీం లీడర్ కేశవమూర్తి, అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్, సిబ్బంది బాలరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

బత్తలపల్లి : వాల్మీకి బోయ సంఘం జిల్లా నాయకులు వాల్మీకి నాగు మండల అనారోగ్యంతో బాధపడుతూ బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వాల్మీకి బోయ సంఘం జిల్లా నాయకులు బాధితుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడికి 21,000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులతో పాటు వాల్మీకి బోయ సంఘం , ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ జక్కుల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి బోయ క్రాంతి నాయుడు, జిల్లా అధ్యక్షులు బోయ సాంబశివ, రాష్ట్ర ప్రొఫెషనల్ కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పుట్టపర్తి రూరల్ : రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ, ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్స్యూట్యూల్ సంయుక్తంగా బుధవారం కంటి పరీక్షల వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అందులో భాగంగా పుట్టపర్తి మండల పరిధిలోని పలు పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళకర విద్యాసంస్థల లోని మంగళకర ఎడ్యుకేషన్ చిల్డ్రన్స్ హోంలో విమానాశ్రయం రోడ్డులో గల హ్యాపీ హోం ట్రస్ట్ తదితర చోట్ల వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ బి. రమేష్, ఎల్‌వి.ప్రసాద్ కోఆర్డినేటర్ రఫిక్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ బత్తలపల్లి సెంటర్స్ ఇన్‌ఛార్జిలు సిస్టర్స్ ఆగ్నేస్, క్యాథరిన్, సబితా, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు

గుడిబండ : మండల పరిధిలోని రాళ్లపల్లిలోని ఎస్సీ, ముస్లిం కాలనీలల్లో తాగునీటి పైపులైన్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచి లక్ష్మినారాయణ తెలిపారు. ఇందుకోసం దాదాపు మూడు లక్షల రూపాయలు వెచ్చించినట్లు ఆయన చెప్పారు.

16న కురుబ యువజన సంఘం సమావేశం

బత్తలపల్లి : ఈ నెల 16న జిల్లా కురుబ యువజన సంఘం ఆధ్వర్యంలో కోటి సూర్యప్రకాష్ బాబు డిగ్రీ కాలేజ్ యందు జరుగుతున్న సమావేశానికి కురుబ యువకులంతా తరలి రావాలని ఆసంఘం నాయకులు కోరారు. ఈ సమావేశంలో యువజన కమిటీల ఎన్నిక ఉంటుందన్నారు. కురుబ యువత రాష్ట్ర అధ్యక్షులు వశికేరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి కురుబ యువతి యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు పావురాల జగదీశ్ , రాష్ట్ర యువత శ్రీకాంత్ , జిల్లా కురుబ యువత నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు గుర్తింపు కార్డులు

చిలమత్తూరు : చిలమత్తూరు గ్రామపంచాయతీ పరిధిలో పని చేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గుర్తింపు కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ మేరకు సర్పంచ్ సంధ్య, కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ 8 నెలలకు సంబందించిన సోపులు, నూనె, గ్లౌజ్‌లు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ సర్పంచ్ భర్త హరీష్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

ధర్మవరం టౌన్ : వచ్చే ఖరీఫ్ లో పంటలు సాగు చేసే రైతులు భూసార పరీక్షలు చేయించుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయకులు సన్నావుల్లా తెలిపారు. బుధవారం మండలంలోని పోతుకుంట ఆర్బీకే కార్యాలయంలో భూసార పరీక్షలపై సిబ్బందికి రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల్లో భూసార పరీక్షలు ఎలా చేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎఒ చన్నవీరస్వామి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న అధికారులు

పుట్టపర్తిలో మున్సిపల్ కార్మికుల నిరసన

పుట్టపర్తి అర్బన్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు ఉద్యోగ, కార్మిక, సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులు బుధవారం స్థానిక హనుమాన్ టెంపుల్ సర్కిల్ లో మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కానందున పట్టణంలో పారిశుధ్యం లోపించిందన్నారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దీనికి తోడు డ్రైనేజీ కార్మికులు ఇంజినీరింగ్ కార్మికులు సైతం సమ్మెకు సిద్ధమవుతున్నారన్నారు. వీధిలైట్లు, డ్రైనేజీ, త్రాగునీరు సరఫరా ఇవన్నీ ఆగిపోతాయని హెచ్చరించారు. మూడు నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని, 8 నెలల పిఎఫ్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పలుమార్లు అధికారుల, పాలకుల దృష్టికి తెచ్చిన పట్టించుకోలేదన్నారు. కార్మికుల నిరసనకు వివిధ రాజకీయ పార్టీలు తమ మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పైపల్లి గంగాద్రి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జనసేన నాయకులు తిరుపతేంద్ర, అబ్దుల్ అజ, టిఎన్‌టియుసి నాయకులు రామాంజి, పాపారెడ్డి, కొండకమర్ల రాము, నాయకులు జ్యోతి ప్రసాద్, ఆంజనేయులు, గోవిందు, పెద్దన్న, నాగార్జున, నరసింహులు, నరసింహ, రమణ తదితరులు పాల్గొన్నారు.



మానవహారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఆశాల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి మడకశిర రూరల్

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిచాలని ఆశా కార్యకర్తల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య కోరారు. మడకశిర మండలం గుండమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో బుధవారం ఏపీ ఆశ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ శాంతికి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సౌభాగ్య మాట్లాడుతూ వార్డు సచివాలయానికి ఒక్కొక్క ఆశాను మ్యాపింగ్ చేసి ఎన్ హెచ్ ఎం నిబంధనలకు విరుద్ధంగా 3000 నుండి 5000 జనాభాను కేటాయించారని విమర్శించారు. అర్బన్ లో పనిచేస్తున్న ఆశాలను దూరప్రాంతాలకు మ్యాపింగ్ చేయడం వల్ల రోజువారి రవాణ చార్జీలకు నెలకు రెండు వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని సర్వేల పేరుతో సంవత్సరానికి 30 రికార్డుల వరకు రాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలు పేరుతో నెలలో అనేక సార్లు పిహెచ్‌సిలకు పిలుస్తున్నారని, వచ్చే వేతనంలో సగం ఆరోగ్య సేవలు అందించడానికి ఖర్చు అవుతుందని అన్నారు. ఆశలకు సంబంధంలేని ఏ ఇతర ఆన్‌లైన్ పనులు చేయించరాదన్నారు. ఆశాలసమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఆశా వర్కర్ల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 17న డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహాలక్ష్మి, జ్ఞానమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో బాలికలకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-హిందూపురం

ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని, దానికి అనుగుణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. నాబార్డు నిధులు రూ. 8కోట్లతో నిర్మించిన మహిళా పాలిటెక్నిక్ కళాశాల నూతన భవన సముదాయాన్ని ఎంపీ, ఎమ్మెల్సీ బుధవారం ప్రారంభించారు.

నేరాలు ఘోరాలు

తండ్రి మందలించాడని...బాలుడు ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : పాఠశాలకు సక్రమంగా వెళ్లలేదని తండ్రి మందలించాడని ఓ బాలుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు... పట్టణంలోని గిర్రాజుకాలనీకి చెందిన రమేశ్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు బాలక్రిష్ణ సాయినగర్ ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. అయితే బాలక్రిష్ణ పాఠశాలకు సక్రమంగా వెళ్లక పోవడంతో అతని తండ్రి రమేశ్ కుమారుడుని మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన బాలక్రిష్ణ ఇంటిలో ఉన్న మాత్రలను మింగి ఆపరస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన తండ్రి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడవైద్యులు ప్రథమచికిత్స అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

నల్లచెరువు : మండల పరిధిలోని పార్లపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహబూబ్ బాషా (31)అనే యువకునికి తీవ్ర గాయాలయ్యాయి.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల పరిధిలోని కప్పల బండ గ్రామ సమీపంలో రైతు కొలసాని శ్రీనివాసులు బోరు వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులోని కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారని బాధిత రైతు తెలిపారు. విషయాన్ని పుట్టపర్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని లేకపోతే వరి చేను ఎండిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

సంక్షేమం ముసుగులో మోసం : పల్లె

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జగనన్నే మా భవిష్యత్తు అనే బదులు జగనన్నే మోసం అని పెట్టుకుంటే బాగుంటుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం టిడిపి స్థానిక కార్యాలయంలో పల్లె విలేకరులతో మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసిందని ఈ కార్యక్రమం చేపట్టిందని ప్రశ్నించారు. జగన్ సంక్షేమం ముసుగులో ఇష్టానుసారం ధరలు పెంచారన్నారు. 10 రూపాయలు ఇచ్చి 100 రూపాయలు లాక్కుంటున్నట్లు ఉందన్నారు. ఇసుక, స్టీలు, మద్యం, గ్యాస్, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచేసి నిత్యావసర వస్తువులను సామాన్యుడు కొనలేని స్థితికి తెచ్చారన్నారు. అన్నా క్యాంటీన్ రద్దు చేశారని, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, నిరుద్యోగ భృతి ఇలా పేదలకు అందే పథకాలన్నీ రద్దు చేశారన్నారు. అప్పుల మీద అప్పులు తెచ్చి ఉద్యోగులకు నెలనెలా వేతనాలు ఇవ్వలేని స్థితికి ఈ ప్రభుత్వం చేరుకుందన్నారు. ఈరోజు సగటున రాష్ట్రంలో ప్రజలందరికీ తలకు రూ. 3.70 లక్షల అప్పు పడుతుందన్నారు. టిట్కో గృహాలకు నేటికీ మోక్షం లేదని, ఇప్పుడు పేదలకు ఒక సెంటు స్థలంలో ఇల్లు కట్టిస్తున్నానని చెబుతున్న ప్రభుత్వం ఎక్కడైనా పూర్తి చేసిందా అని ప్రశ్నించారు. అనుభవం లేని వాడు లారీ తోలితే ఎలా ఉంటుందో జగన్ పాలన అలా ఉందని వ్యాఖ్యానించారు. అధోగతి పాలైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు కోనంకి గంగాధర్, దారపునేని చంద్రశేఖర్, గూడూరు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె



విద్యార్థినిని అభినందిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

జాతీయ స్థాయి పోటీల్లో 'పాంచజన్య' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయన్స్ న్యూఢిల్లీ వారు జాతీయ స్థాయిలో డిసెంబరు 22న నిర్వహించిన పరీక్షల్లో పాంచజన్య బ్రిలియంట్స్ హై స్కూల్ కు చెందిన విద్యార్థి ప్రతిభ కనపర్చింది. పాఠశాల విద్యార్థిని రేణుప్రియ ద్వితీయ స్థానం సాధించింది. ఈ మేరకు బుధవారం పాఠశాలలో విద్యార్థి రేణు ప్రియను పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, ఎన్ఐఎస్ ఎ వారు పంపినక్యాష్ అవార్డు, షీల్డ్ లను అందించారు. ఈ సందర్భంగా పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రేణు ప్రియ ద్వితీయ స్థానం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, ఎఒ భాస్కర్, హెచ్ఎం గాయిత్రి, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హిందూపురం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మున్సిపల్ అధికారులతో పాటు సచివాలయ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజాశక్తితో మాట్లాడారు. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగు పరచడం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అదే విధంగా అక్రమ కట్టడాలపై ప్రత్యేక నిఘా వుంచడంతో పాటు, అభివృద్ధి పనులను వేగవంతం చేసి పురపాలక సంఘాన్ని రాష్ట్రంలోనే ఉత్తమ పురపాలక సంఘంగా తీర్చిదిద్దుతామని అన్నారు. పట్టణ వ్యాప్తంగా అక్రమ కట్టడాలను గుర్తించడానికి కొంత మంది అధికారులను ఏర్పాటు చేసి, అక్రమ కట్టడాలను గుర్తించి వాటిని బిపిఎస్ పథకం ద్వారా సక్రమ కట్టడంగా మార్చి పురపాలక సంఘానికి ఆదాయం పెంచుతామన్నారు. పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో సహకరిస్తే మరింత అభివృద్ధి చేయడానికి సాధ్యం అవుతుందన్నారు. మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు 2023–24 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను (సంవత్సరం పన్ను ఒకేసారి) చెల్లించిన వారికి 5శాతం రాయితీ ప్రకటించామన్నారు. పట్టణ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. పూర్తి స్థాయిలో పట్టణంపై అవగాహన పెంచుకుని అన్ని విభాగాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలకు డిమాండ్

గుడిబండ : ధర్మవరం నియోజకవర్గం తుమ్మల గ్రామంలో ఆర్మీ జవాన్ నరసింహారెడ్డి పై దాడి చేసిన వారిని వెంటనే పోలీసులు అరెస్ట్ చేయాలని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడికి కారకులైన సుధాకర్ రెడ్డి తో పాటు అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని లేని పక్షంలో జిల్లా ఎస్సీ సెల్ విభాగం ద్వారా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి ఇంటిని ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు.

మండల సమస్యలపై 14న పాదయాత్ర

అమరాపురం : మండలంలో నెలకొన్న పలు సమస్యలపై ఈనెల 14న పాదయాత్ర చేపడుతున్నట్లు టిడిపి మండల కన్వీనర్ గణేష్ తెలిపారు. మండల పరిధిలోని వీరపసముద్రం గ్రామం నుండి నిర్వహించే పాదయాత్రలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరాపురం నుండి కర్ణాటక బార్డర్ వరకు 23 కో ట్ల రూపాయలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని చెప్పారు. గుత్తేదారుడు ఉన్న రోడ్డును తొలగించి కంకర వేసి వదిలేశాడన్నారు. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై టిడిపి ఆధ్వర్యంలో చేపట్టే పాదయాత్రకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ఐదు మండలాల్లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆక్రమణలపై చర్యలకు డిమాండ్

కదిరి టౌన్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వఢ్ర సామాజిక వర్గాల సంక్షేమం కోసం కదిరి రూరల్ మండలం కుమ్మరవాళ్ళపల్లిలో కమ్యూనిటీ భవనం కోసం గత ప్రభుత్వం కేటాయించిన స్థలం కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని వఢ్ర సామాజికవర్గం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం కదిరి డిప్యూటీ తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుట్లమీద బయప్ప, తాతం మల్లికార్జున, పూలకుంటపల్లి సూరి, తలుపుల శ్రీనివాస్ నాయుడు, పోతినేని ఆంజనేయులు, మాజీ సింగల్ విండో డైరెక్టర్ పోతినేని నరసింహులు, చెరువు బయ్యప్ప, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఇఫ్తార్‌విందు

రొద్దం : రొద్దం పోలీస్ స్టేషన్ లో పెనుకొండ డి ఎస్ పి హుసేన్ పీరా ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగస్వామి, పోలీసులు, ముస్లింసోదరులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో పాము కలకలం

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నాగుపాము కలకలం రేపింది. మంగళవారం ఉదయం స్థానిక తహశీల్దార్ కార్యాలయం తలుపులు తీసిన తరువాత కంప్యూటర్ గదిలోకి వెళ్లిన సిబ్బందికి నాగుపాము కన్పించింది. గమనించిన సిబ్బంది పామును బయటికి పంపారు. ఇదిలా ఉండగా కార్యాలయంలో ఎక్కడ చూసినా చెత్తా, చెదారం ఉండటం, పరిసర ప్రాంతంలో చెట్లు ఎక్కువగా ఉండడంతో విషపురుగులు కార్యాలయంలోకి చేరుతున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు.



కంప్యూటర్ గదిలో ఉన్న పాము

ప్రజాభివృద్ధే వైసిపి ధ్యేయం:ఎమ్మెల్యేలు





మహిళలతో మాట్లాడుతున్న మడకశిర, పుట్టపర్తి ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శ్రీధర్‌రెడ్డి

మడకశిర రూరల్ : సిఎం జగన్ననని మళ్లీ సీఎం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కోరారు. మండలంలోని గోవిందాపురం గ్రామ సచివాలయం పరిధి లోని బుధవారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, ఎంపిటీసీ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలు తిరిగి అందాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రావాలని ఏపీ కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం బత్తలపల్లిలో మారుతినగర్ లో 'నువ్వే మా నమ్మకం జగన్' అనే కార్యక్రమాన్ని సర్పంచు కాక్కిం కాశమ్మతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నను సీఎంగా అవకాశం ఇవ్వాలన్నారు. అదేవిధంగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, షేక్షావలి, బాబాజాన్, షాపు తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని అడపాల వీధి 1,2, సచివాలయాల పరిధిలోని 4, 5వ వార్డులలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డికి ఆయా కాలనీల వాసుల ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపను సందర్శించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన కొన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రణీత్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ప్రకాష్, సాదిక్‌బాషా, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ హరిబాబు, వైస్‌ఛైర్మన్లు,కౌన్సిలర్లు, కో ఆప్షన్స్ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపిటీసీలు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వమే వస్తుందని వైసిపి హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇక్బాల్, ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. ఈ మేరకు వారు బుధవారం అప్పనపల్లి,పెద్దనపల్లి లో జరిగిన "జగనన్నే మా భావిష్యత్తు – జగనన్నే మన నమ్మకం" అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో వైసిపి మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

ఓబులదేవర చెరువు : సీఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజల్లో నమ్మకం రెట్టింపు అయ్యిందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఓబులదేవర చెరువు పంచాయతీలో సచివాలయం 2 పరిధిలోని మారేవాండ్లపల్లి, బాబా సాహెబ్ పల్లి లో నిర్వహించిన 'గడప గడప మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పర్వీన్ భాను, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ కోళ్లకృష్ణారెడ్డి, టి కుంట్లపల్లి సచివాలయం కన్వీనర్, (మండల కార్యదర్శి) చంద్రమౌళి నాయుడు, అగ్రి అడ్వైజర్ కమిటీ చైర్మన్ లక్ష్మి రెడ్డి, ఓబుల దేవర చెరువు పంచాయతీ సర్పంచ్ గోవిందు, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. బుధవారం పురపాలక సంఘంలో పలు వార్డులో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.